క్లుప్తంగా

బెంగళూరులో కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ



రఫీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ఆరోగ్య సమస్యలతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న బి.కొత్తకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాగొండ రఫీని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం పరామర్శించారు. క్రియాశీల కార్యకర్త అయిన రఫీ వైద్యం చేయించుకుని బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, బసిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మె

బి.కొత్తకోట: మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు సలీం, వేణు కోరారు. బి.కొత్తకోటలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను రద్దుచేసి సంక్షేమాన్ని విస్మరించిందని, దానిపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హరీష్‌రెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని గండబోయనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.శ్రీనివాసులు ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదే గ్రామం కొత్తవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డెప్ప రెడ్డి ఇటీవల మరణించారు. వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ప్రసాద్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉత్తన్న, ఓబుల్‌రెడ్డి, రమణ, నాయకులు ఆయన వెంట పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సాయిలోకేష్

మదనపల్లె సిటీ: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ రెసిడెన్సీలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయి లోకేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ యావత్ భారతావని తమ సొంత ఆస్తిగా చెప్పుకోగదగిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, పార్థసారధి, ఎల్లంపల్లి ప్రశాంత్, కృష్ణమూర్తి, రవికుమార్, భగవాన్, కృష్ణయాదవ్, పిల్లాస్వామినాయక్, బాలజ్యోతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శిగా జనార్దన్‌రెడ్డి



జనార్దన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని మదనపల్లె గెజిటెడ్ ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వి.జనార్దన్‌రెడ్డి(రిటైర్డ్ సీనియర్ లైబ్రేరియన్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ), జాయింట్ సెక్రటరిగా కోటేశ్వరరావు (రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్), కోశాధికారిగా రామరాజు(రిటైర్డ్ సీఈఓ, టౌన్ బ్యాంకు), ఈసీ సభ్యులుగా వై.ఎస్.మునిరత్నం, గోపాల్‌నాయుడు, కోదండరామిరెడ్డి, రామస్వామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

కేవీపల్లె: మండలంలోని నూతనకాల్వలోని చీనేపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద పంచమ వేద మహాభారత యజ్ఞం ఆదివారం ప్రారంభించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజు, పాండవులు, శ్రీ కృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి యజ్ఞం ప్రారంభించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డిరాణి మొదటి రోజు వ్యాస జననం హరికథా గానం ఆలపించారు. రాత్రి శ్రీకృష్ణలీలలు నాటకం ప్రదర్శించారు. మే 1వ తేదీ వరకు యజ్ఞం కొనసాగునని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న కురు, పాండవ జననం

కలకడ: మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ కలకడ దేవళంపేట కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం సమీపంలో మహాభారత యజ్ఞం నిర్వహించారు. ఆదివారం మొదటి రోజున కురుపాండవ జననం హరికథ ఆకట్టుకుంది. ధర్మకర్త బాలయ్యగారిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ రామయ్య, గ్రామస్థుల ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బోర్డు మూలకు.. సమాచారం కంచికి



ఉపాధి హామీ పనుల వద్ద సమాచార బోర్డు ఏళ్లుగా మూలనపడినా పట్టించుకోవడం లేదు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని మునగాని బండవంద ఫీడల్ ఛానల్ పనులు రూ.1.39 లక్షలు వెచ్చించి 2016లో పూర్తి చేశారు. జరిగిన పనిని ప్రజలకు తెలియజేస్తూ సమాచార బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం నిధులు మంజూరు చేస్తారు. అయితే అక్కడ పెట్టాల్సిన బోర్డును ఇదిగో ఇలా ఓ ఇంటి గోడ వద్ద మూలన పడేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇది దిష్టిబొమ్మలా దర్శన మిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – గుర్రంకొండ

● నీటి శుద్ధి కేంద్రం మూత



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రజలకు సురక్షితమైన మంచి నీరు అందించాలనే ఉద్దేశంలో ఏర్పాటుచేసిన నీటి శుద్ధి ప్లాంట్ ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. పీలేరు పట్టణంలో 26 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ప్లాంట్ల ఆపరేటర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వాటిని మూసివేస్తున్నారు. ఇప్పటికే చెన్నారెడ్డివీధి, షుకూర్ థియేటర్ వద్ద ఉన్న ఆర్‌వో ప్లాంట్లు మూసి వేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – పీలేరు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

రాజంపేట రూరల్: కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై మేడే పోరాట సస్ఫూర్తితో పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఈ. సికింధర్ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు కార్మిక వర్గం పోరాడీ సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కార్మిక ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకోవటమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. వ్యవసాయ, సహకార రంగాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించటానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మేడేను పురస్కరించుకొని మే 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

రెడ్డెమ్మతల్లీ.. చల్లంగా చూడు తల్లీ!



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మ తల్లీ చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరు తాగి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. హిందువులతోపాటు ముస్లీమ్‌లు అమ్మవారిని దర్శించుకోవడం గమనార్హం.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

పీలేరు: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి అమరనాథ్ పేర్కొన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేసవిలో బయట తిరగకుండా, టీవీలు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా తమ మేథో శక్తి పెంచుకోవడానికి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు డ్రాయింగ్, చెస్, చేతిరాత, క్యారంబోర్డు ఆటల్లో పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం




మాట్లాడుతున్న సాంబశివ, సురేష్

రాయచోటి అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం రాయచోటి నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో మే 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ వారు పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, ఏఐటీయూసీ రాయచోటి కార్యదర్శి బి.వెంకటరమణ, నేతలు కేశవరావు, హరి పాల్గొన్నారు.

ప్రేమ, సహనం చూపిన కరుణామయుడు ఏసుక్రీస్తు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



సందేశం వినిపిస్తున్న సునీల్‌వరకుమార్



సెయింట్‌జాన్స్ చర్చి ప్రార్థనల్లో నిస్సార్ అహ్మద్

మదనపల్లె సిటీ: కరుణామయుడు ఏసుక్రీస్తు అని స్థానిక జెసీఎం చర్చి డివిజన్ సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ సునీల్‌వరకుమార్ ఉద్ఘోధించారు. స్థానిక జెసీఎం చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ఈస్టర్ ఆరాధనల్లో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. చర్చిని మల్లె పూలతో సుందరంగా అలంకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ, సహనం, శాంతి కుసుమాలను పూయించిన కృపామయుడు ఏసు అని తెలిపారు. శిలువ వేసిన మూడో రోజు ఏసుక్రీస్తు తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెసీఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని సీఎస్ఐ, ఆరోగ్యమాత, కురవంకలోని చర్చి, శానిటోరియంలోని చర్చిలలో ఈస్టర్ వేడుకలు జరిగాయి. మదనపల్లె మండలం గుడిసివారిపల్లె సెయింట్ జాన్స్ చర్చిలో జరిగిన ఈస్టర్ ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఈస్టర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఏసు జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ ఆర్.మేరి, కార్యదర్శి మార్టిన్, అజయ్, పాల్ చంద్రశేఖర్, యూనస్, మల్లికార్జున రెడ్డి, ఈశ్వర్‌నాయక్, సాధిక్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

కలికిరి: ఈ నెల 30 తేదీ నుంచి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ద్వారా దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని సబ్ రిజిస్ట్రార్ పార్థసారధి తెలిపారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా దస్తావేజులను సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు, పారదర్శక రిజిస్ట్రేషన్‌కు ఈ ప్రక్రియ ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కలికిరి: నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్ అకాడమీ(ఎన్ఏ) కోర్సులలో ప్రవేశాలకు ప్రకటించిన తుది జాబితాలో కలికిరి సైనిక పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులకు స్థానం లభించినట్లు పాఠశాల వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పాఠశాల తొలి బ్యాచ్ నుంచి ఇద్దరు విద్యార్థులు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్) పరీక్ష, డైరెక్ట్ ఎంట్రీ ద్వారా ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ), ఇండియన్ నావల్ అకాడమీ(ఐఎన్ఏ) కోసం ఎస్ఎస్‌బీలో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు అమ్మవారి ఆలయం ముస్తాబు



ప్రారంభానికి సిద్ధమైన ఆలయం

పీలేరు రూరల్: పట్టణంలోని బండ్లవంక గ్రామంలో నూతనంగా నిర్మించిన మాతమ్మతల్లి ఆలయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. విగ్రహ ప్రతిష్టకు నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లుచేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ సోమవారం(నేడు) గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, హోమాలు, జలాధివాసం ఉంటాయన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు చండీ హోమం, అనంతరం వివిధ రకాల హోమాలు, తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 10.44 నిమిషాలకు మాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట అనంతరం తీర్థప్రసాదాలు వితరణ, అన్నదానం ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గణేష్ జట్టు



విజేతగా నిలిచిన గణేష్ జట్టు క్రీడాకారులు

పీలేరురూరల్: మండలంలోని రేగళ్లులో గత మూడు రోజులుగా నిర్వహించిన రేగళ్లు ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్‌లో గణేష్ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం పదిహేను జట్లు పోటీపడగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. రేగళ్లుకు చెందిన గణేష్ జట్టు విజేతగా నిలవగా, లియకత్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ప్రథమ, ద్వితీయ, విజేతలకు రూ.10,116, రూ.7,116 లు నిర్వాహకులు షామీర్, లియాకత్ అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ భాను, బెస్ట్ బౌలర్‌గా బి.భాను నిలిచారు.

22 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



మేడికుర్తి పాఠశాలలో సమావేశమైన విద్యార్థులు

కలికిరి: మండలంలోని మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2002–03లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత పాఠశాల ప్రాంగణంలో కలుసుకుని సందడి నెలకొంది. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి గౌరవించారు. పాత జ్ఞాపకాలతో అందరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరించారు. బసవయ్య, మూర్తి, రామ్మోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, ప్రకాష్, వెంకటరమణరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజంపేట టౌన్: మండలంలోని డీబీఎస్‌పల్లె గ్రామంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు కృష్ణ స్వామి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోత్సకంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం కల్యాణ ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

మల్లూరమ్మా.. కాపాడు తల్లీ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు, కొత్తపల్లె గ్రామాల పంచాయతీ పరిధిలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ఆలయ అర్చకులు పల రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నాగారపమ్మ తల్లికి పూజలు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. శ్రీరామ.. జయరామ.. జయ జయ రామ అని భక్తుల రామ నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వరుడిగా రాముడు, వధువుగా సీతమ్మను చూసి భక్తులు పులకించారు. సీతారాముల కల్యాణ క్రతువును అర్చకులు సాయి ఆధ్వర్యంలో వేదపండితులచే వి.వి ప్రతాప్‌రెడ్డి, భాగ్యమ్మ దంపతులు జరిపారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

రాయచోటి అర్బన్: రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనందించాలని రజకసంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ బాబు కోరారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో రజకసంఘం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు చాలీచాలని భత్యాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ బిల్లు అసెంబ్లీలో పెట్టి తీర్మాణం చేసి పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం వలన సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. పలు మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న దోబి ఘాట్‌లను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలోఎం.వి.రమణ, వి. రామాంజులు, కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు మధు, ఆనంద్, సాంబశివ, మల్లిఖార్జున పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



పీలేరు: అవగాహన కల్పిస్తున్న అధికారులు



అగ్నిమాపక టూల్స్‌గురించి వివరిస్తున్న శివప్ప

మదనపల్లె సిటీ: వేసవి సెలవుల్లో విద్యార్థులు చెరువు, బావుల వద్ద ఈతకు వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి శివప్ప పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో విద్యార్థులకు బిఏ సెట్, అకాష్‌లైట్, హైడ్రాలిక్ టూల్స్, ఇతర అగ్ని మాపక పరికరాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ అగ్నిప్ర మాదాలు జరిగితే 101 లేదా 085722101ను ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ములకలచెరువు, వాల్మీకిపురం అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి మస్తాన్ పేర్కొన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, ఆయిల్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినపుడు ఏ విధంగా మంటలు అదుపుచేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినపుడు 101 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్, మహబూబ్ బాషా, చైతన్యకుమార్, జాకీర్, షఫీ పాల్గొన్నారు.

ములకలచెరువు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి నరసింహులు అన్నారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద స్థానికులు, యువకులకు ఆదివారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో చేసి చూపించారు. ప్రమాదాల నివారణకు పరికరాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. అనంతరం మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం పేరుతో అదే పాఠశాలలో సందడి చేశారు. 34 ఏళ్ల తరువాత ఒకేచోట సమావేశమైన వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, చిన్న నాటి మధురస్మృతులను నెమరువేసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం వెంకటాచలపతి, హిందీ టీచర్ రహీంసాబ్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం తాము జీవితంలో ఎంతటి ఉన్నతమైన స్థానంలో ఉన్నా కూడా చదువుకున్న విద్యాలయం అభివృద్ధికి తమ వంతు సాయం అందిద్దామని మిత్రులందరూ తీర్మానించుకున్నారు. సుదీర్ఘ విరామం తరువాత మిత్రులందరూ మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామోనని బరువెక్కిన గుండెలతో వీడ్కోలు పలుకుతూ వెనుదిరిగారు.